1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 115    శుక్రవారం మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## మా కొత్త ఆయుధంతో.. అమెరికాకు హార్ట్ఎటాకే: ఇరాన్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 30)

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతోన్నాయి. ఈ క్రమంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడనున్నట్లు తెలిపారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని హెచ్చరించారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హర్మ్యూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారు. ఈ క్రమంలో ఇరాన్ నుంచి తాజా హెచ్చరికలు వచ్చాయి.

'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని షారమ్ ఇరానీ పేర్కొన్నారు. అయితే, ఆ ఆయుధం ఏంటి అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. హర్మ్యూజ్ (హార్ముజ్ జల సంధి)ను దిగ్బంధించి.. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, చర్చలకు తీసుకురావాలనే అమెరికా వ్యూహాన్ని ఆయన కొట్టిపారేశారు. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై తమ దళాలు దాదాపు ఏడు క్షిపణులతో విరుచుకుపడ్డాయన్నారు. దీంతో అది కొన్ని రోజులు కార్యకలాపాలను నిర్వహించలేకపోయిం దన్నారు. అమెరికా దిగ్బంధనం ఉన్నప్పటికీ.. నౌకలు కొన్ని తమ ఓడరేవుల నుంచి వెళ్తున్నాయన్నారు. మరికొన్ని వాటి గమ్యస్థానాలకు కూడా చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈసందర్భంగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బ కొడతామన్నారు. ▶మిగతా 2లో

## సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం: రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 30)



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని ▶మిగతా 2లో

## 'మీ చట్టాలను మార్చండి..': 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 30)



15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో గురువారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో 30 వారాల గర్భవిచ్ఛిత్తికి బాలికకు ఇటీవల అత్యున్నత న్యాయస్థానం అనుమతిచ్చింది. అయితే దీనిపై ఎయిమ్స్ క్యూరేటివ్ పిటిషన్ వేసింది. ఈ దశలో గర్భాన్ని తొలిగిస్తే.. ఆ బాలిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం సూచనలు చేసింది. అత్యాచార బాధితుల కోసం చట్టాలను సవరించాలని సూచించింది.ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ▶మిగతా 2లో

# 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు ఘనత మీదే..

- ప్రభుత్వ యంత్రాంగానికి చంద్రబాబు ఆత్మీయ విందు
- చంద్రబాబుకు ఇటీవల జాతీయస్థాయిలో బిజినెస్ రిఫార్మర్ అవార్డు నే
- మంత్రులు, అధికారులకు సీఎం ఆత్మీయ విందు
- మీరే అసలైన విజేతలు అంటూ ప్రభుత్వ యంత్రాంగానికి ప్రశంసలు
- జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించిన సీఎం
- సంస్కరణలు చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయన్న మంత్రి పయ్యావుల
- భవిష్యత్ లక్ష్యాలు, వ్యూహాలపై ఉన్నతాధికారులతో సీఎం కీలక సమావేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 30)

తనకు జాతీయ స్థాయిలో 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025' పురస్కారం లభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగానికి ఆత్మీయ విందు ఇచ్చారు. 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' పేరుతో అమరావతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన మంత్రులు, అధికారులు, ఉద్యోగులే అసలైన విజేతలని సీఎం ఈ సందర్భంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమన్వయకర్తగా ▶మిగతా 2లో

## హర్మ్యూజ్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది: ఇరాన్ సుప్రీంలీడర్

లిఖిత పూర్వక ప్రకటన విడుదల చేసిన ఇరాన్ సుప్రీం లీడర్
దిగ్బంధం కొనసాగుతున్నా, ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను పరిరక్షించుకుంటోందని వెల్లడి
పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్ల ఏకైక స్థానం జలాల అడుగున అని చురక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 30)

అమెరికా అవమానకర వైఫల్యంతో హర్మ్యూజ్ జలసంధిలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్, హర్మ్యూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం రూపుదిద్దుకుంటోందని అన్నారు. ఈ మేరకు ఆయన లిఖిత పూర్వక ప్రకటన ▶మిగతా 2లో

## నేడుకృష్ణా జిల్లాలో చంద్రబాబు పర్యటన...

పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేక ముఖాముఖి
గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభించనున్న చంద్రబాబు
ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు పింఛన్లు అందించి వారితో ముచ్చటించనున్న ముఖ్యమంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 30)



ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (మే 1) శుక్రవారం కృష్ణా జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఒకే రోజు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా గడపనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమం, మేడే వేడుకలతో పాటు ఆసుపత్రి ప్రారంభోత్సవం వంటి కీలక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కలలో జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో ▶మిగతా 2లో

## 4 రాష్ట్రాల్లోనూ ఎన్డీయేదే విజయం పుదుచ్చేరిలోనూ నెగ్గుతాం: మోదీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 30)

ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల (కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్) అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఎన్నికల్లో కూడా నెగ్గుతామని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్, ప్రయాగ్‌రాజ్‌లను కలుపుతూ నిర్మించిన 594 కిలోమీటర్ల గంగా ఎక్స్‌ప్రెస్‌వేను బుధవారం ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్‌లో ఈసారి ఓటర్లు భయరహిత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకుముందు మోదీ వారణాసిలో రోడ్ షో నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగిన ఈ రోడ్ షో.. కాశీ విశ్వనాథ ఆలయం వద్ద ముగిసింది. ఆలయంలో వేద మంత్రాల నడుమ ప్రధాని ప్రార్థనలు జరిపారు.

## అమెరికా పద్ధతి మార్చుకుంటే చర్చలకు మేం సిద్ధం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

అమెరికా వైఖరి మార్చుకుంటే చర్చలకు సిద్ధమన్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్
హర్మ్యూజ్ జలసంధిలో అభద్రతకు అమెరికా, ఇజ్రాయెలే కారణమని ఆరోపణ
జపాన్ ప్రధానితో ఫోన్‌లో సంభాషణ, నౌకల భద్రతపై చర్చ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 30)

అమెరికా తన వైఖరి మార్చుకుంటే, దౌత్యమార్గంలో చర్చలు జరపడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. రెచ్చగొట్టే చర్యలు, మితిమీరిన విధానాలకు వాషింగ్టన్ స్వస్తి పలికితేనే దౌత్య ప్రక్రియను ముందుకు తీసుకెళతామని ఆయన గురువారం తెలిపారు.జపాన్ ప్రధాని సనాయే టకాయిచీతో ఫోన్‌లో మాట్లాడిన పెజెష్కియాన్, గల్ఫ్ మరియు హర్మ్యూజ్ జలసంధిలో ప్రస్తుత అభద్రతకు అమెరికా, ఇజ్రాయెల్ చర్యలే కారణమని ఆరోపించారు. ఇరాన్ నౌకలపై అమెరికన్ సముద్రపు దొంగతనాన్ని ఆపాలని, దానిని అందరూ ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సంభాషణలో ▶మిగతా 2లో

## అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపిన మంత్రి లోకేష్
ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారం కోసం సమీకృత పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశం


2

# ‘బిజినెస్ రిఫార్మర్’ అవార్డు ఘనత మీదే..

వ్యవహరించారు. సమావేశ ప్రాంగణానికి సీఎం చంద్రబాబు చేరుకోగానే మంత్రులు, అధికారులు చప్పట్లతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ విందుకు మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు, క్షేత్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. ఈ పురస్కారం రావడానికి ‘టీమ్ ఏపీ’ సమష్టి కృషే కారణమని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని, ఈ విజయాన్ని అందరితో కలిసి పంచుకోవడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశానని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సంస్కరణలు అనేవి ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్, ఓపెన్ స్కై పాలసీ, టెలికాం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి ఎన్నో రంగాల్లో ఆయన ముందుచూపుతో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన అనంతరం, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎదుర్కొన్న సవాళ్లను కూడా ఆయన ప్రస్తావించారు. విందు కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై విస్తృతంగా చర్చించారు. పరిపాలనలో మరింత వేగం పెంచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించినట్టు సమాచారం.

## మా కొత్త ఆయుధంతో.. అమెరికాకు హార్ట్ఎటాకే: ఇరాన్

అణు ఒప్పందం కుదిరేవరకు..

ఇరాన్‌తో అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం కొనసాగుతుందని అధ్యక్షుడు ట్రంప్ (ుతీబఎజూ) తాజాగా స్పష్టం చేశారు. దిగ్బంధనాన్ని ఎత్తివేయాలనే ఇరాన్ ప్రతిపాదనపై రాజీపడే ప్రసక్తే లేదని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సైనిక చర్యతో పోలిస్తే.. ఓడరేవుల దిగ్బంధనమే ప్రభావవంతంగా పనిచేస్తోందని, దీంతో టెహ్రాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, చర్చలకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. సంఘర్షణను ముగించాలని వారు కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం: రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు

రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ‘ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ. ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకువెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి.. సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని.. మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు.

పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజంకు కేంద్ర బిందువు..

ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని.. దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## ‘మీ చట్టాలను మార్చండి..’: 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు

ఒక మహిళ మరీ ముఖ్యంగా ఒక బాలికను బలవంతం చేయలేమని ఇటీవల ఈ కేసులో సుప్రీంకోర్టు (ాబజూతీవవవ జశీబతీ) పేర్కొంది. అలాగే ఆ గర్భాన్ని తొలగించేందుకు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ సుప్రీంలో పిటిషన్ వేసింది. “ఎంతో ఆవేదనతో

## మొదటి పేజీ తరువాయి

ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను తీసుకువస్తున్నాం. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు. ఆ మైనర్ తల్లి ఆరోగ్యంపై సుదీర్ఘకాలంలో తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇక్కడొక అవకాశం ఉంది. డెలివరీకి ఇంకా నాలుగు వారాలే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించొచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే” అని ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు వెల్లడించారు.

దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. “బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆమె ఎంత బాధపడి ఉంటుందో ఊహించుకోండి. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించాలి. ఈ ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వారు తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలి. అందుకే ఈ విషయంలో నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నాం” అని పేర్కొంది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని ఈసందర్భంగా కేంద్రానికి సూచనలు చేసింది. 20 వారాలు దాటిన తర్వాత కూడా ఈ అవాంఛిత గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యాచార బాధితులకు అనుమతించేలా చట్టాన్ని సవరించాలని సూచించింది.

## హర్మ్యూజ్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది: ఇరాన్ సుప్రీంలీడర్

విడుదల చేశారు. హర్మ్యూజ్ జలసంధిలో అమెరికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్ తన అణు, క్షిపణి సామర్థ్యాలను పరిరక్షించుకుంటుందని సుప్రీం లీడర్ తెలిపారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్ల ఏకైక స్థానం, ఆ సముద్ర జలాల అడుగున మాత్రమే ఉంటుందని ఎద్దేవా చేశారు. కాగా, ఈ జలసంధి వద్ద కొత్త నియమ నిబంధనలను అమలుచేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొజ్తబా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అంతకుముందు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా అమెరికాకు కౌంటర్ ఇచ్చారు. ఇరాన్ ఓడ రేవులపై అమెరికా దిగ్బంధనం గల్ఫ్‌లో చమురు అంతరాయాలను మరింత తీవ్రతరం చేస్తుందని అన్నారు. తద్వారా అమెరికా తన లక్ష్యాలను సాధించడంలో విఫలం కావడం తథ్యమని పేర్కొన్నారు. సముద్ర దిగ్బంధం లేదా ఆంక్షల విధింపు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

## అమెరికా పద్ధతి మార్చుకుంటే చర్చలకు మేం సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

భాగంగా హర్మ్యూజ్ జలసంధిలో చిక్కుకున్న జపాన్ నౌక, సిబ్బందిని విడిచిపెట్టడంపై ఇరువురు నేతలు చర్చించారు. ముగ్గురు జపాన్ సిబ్బందితో ఉన్న తమ నౌకను సురక్షితంగా పంపడాన్ని సానుకూల పరిణామంగా భావిస్తున్నట్లు టకాయిచీ పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు త్వరగా పునఃప్రారంభమై తుది ఒప్పందం కుదరాలని ఆమె ఆకాంక్షించారు. హోర్ముజ్ జలసంధిలో అన్ని దేశాల నౌకలకు స్వేచ్ఛాయుత, సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలని ఆమె గట్టిగా కోరారు. కాగా, పర్షియన్ గల్ఫ్ నేషన్ డే సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ, సముద్ర మార్గాలపై దిగ్బంధనం విధించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇది ప్రపంచ శాంతికి ముప్పు అని అన్నారు. పాకిస్థాన్‌లో విఫలమైన చర్చల అనంతరం అమెరికా హోర్ముజ్ జలసంధిపై దిగ్బంధనం విధించిన విషయం తెలిసిందే.

## అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)

రాష్ట్రంలో పారిశ్రామిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా కోర్సులను పునర్వ్యవస్థీకరిస్తున్నామని, విద్యార్థులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాలను మార్పు చేయడంతో పాటు, విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు కూడా అందిస్తున్నామని లోకేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఆర్టీ సహకారంతో ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా పాఠ్యాంశాలను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. బోధనా పద్ధతులపై అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపుతున్నామని వివరించారు. ‘టీచర్–స్టూడెంట్–అవుట్‌కమ్’ అనే విధానంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. ‘బడి కోసం’ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాలేజీ పనివేళలు పెంచి, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు: సీఎం చంద్రబాబు

మంత్రి లోకేష్ వివరణ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్ అవసరాలను ముందుగా అంచనా వేసి, అందుకు తగిన కోర్సులను రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. గేమ్ ఛేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కొత్త కోర్సులు రావాల్సిన అవసరం ఉందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొదటి కోర్సును ప్రారంభించినందుకు ఆంధ్రా యూనివర్సిటీని అభినందించారు.

ప్రపంచంలోని టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని, ప్రతి యూనివర్సిటీకి ఒక పారిశ్రామిక సంస్థ అనుసంధానమై ఉండాలని సీఎం స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా ఇతర విదేశీ భాషల్లో శిక్షణ కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని యువత నైపుణ్య స్థాయిని అంచనా వేసేందుకు ‘ర్యాండమ్ స్కిల్ ఆడిట్’ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకు ప్రముఖ కంపెనీలతో అనుసంధానం కావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గత 22 నెలల్లో వివిధ మార్గాల ద్వారా 7 లక్షల మందికి ఉపాధి లభించిందని, ఈ వివరాలన్నింటినీ ‘నైపుణ్యం’ అనే సమీకృత పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని, హాస్టళ్లలో కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. ‘లీప్’ యాప్ ద్వారా విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులు తెలుసుకునేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్’ పేరుతో ఏఐ కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు కృష్ణా జిల్లాలో చంద్రబాబు పర్యటన...

ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారులతో ఆయన ప్రత్యేకంగా ముచ్చటిస్తారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించింది. ఒక్క కృష్ణా జిల్లాలోనే ప్రతినెలా 2.34 లక్షల మందికి రూ.102 కోట్ల పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పమిడిముక్కలలోని ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి పింఛను అందించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం మేడేను పురస్కరించుకుని భవన నిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం తర్వాత పామర్రు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

శుక్రవారం ఉదయం 10:15 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10:25 గంటలకు పమిడిముక్కల ప్రజావేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:45 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1:55 గంటలకు పార్టీ నేతలతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3:40 గంటలకు గుడ్లవల్లేరు చేరుకుని, 3:50 గంటలకు అక్కడ నూతనంగా నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ముగించుకుని సాయంత్రం 4:45 గంటలకు తిరిగి సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## వైభవంగా నరసింహస్వామి జయంతి ఉత్సవాలు




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 30)

కనిగిరి కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున లక్ష్మీ నరసింహస్వామి వారికి పంచామృత అభిషేకం వైభవంగా జరిగింది. అనంతరం వేదపండితులు సుదర్శన హోమం, ధన్వంతరి హోమం, మహా పూర్ణాహుతి, అనంతరం స్వామి వారికి శాంతి కళ్యాణం మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి ఉత్సవాలలో మాజీ మంత్రి వర్యులు ముక్కు కాశి రెడ్డి గారు, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశి రెడ్డి గారు, వాసవీసత్ర సముదాయాలు చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, ముక్కు నర్సారెడ్డి గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి



వారికి పల్లకి సేవాకార్యక్రమాలు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతిరెడ్డి, శారద దంపతులు, కార్యదర్శి కొప్పరపు సత్యాలు, కోశాధికారి ఉప్పాల నరశింహరావు, ఉపాధ్యక్షులు సింగరాజు మాలకొండేశ్వరరావు, మాకినేని సాయిరాం, జాయింట్ సెక్రటరీ ఉప్పాల సుబ్బారావు, కమిటీ సభ్యులు సూర రఘురామిరెడ్డి, ఎంవీఎస్ నారాయణరావు, ధూళిపాళ మల్లి కార్జునరావు, కంబాలదిన్నె శ్రీనివాసులు, పైడిమర్రి ప్రసాద్, కుందురు వెంకటేశ్వరరెడ్డి, అగస్త్య రాజు, హనుమంతరావు, వాగిచెర్ల వెంకటేశ్వర్లు, వాణి, వెంకట నరసయ్య, చక్కా హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఆల్ఫా హై స్కూల్ ప్రతిభ




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)

గురువారం విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఆల్ఫా హై స్కూల్ నుండి 66 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 66 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాల నుండి అత్యధిక మార్కులు ప్రథమ స్థానం ఆల్ఫా గ్రేస్ 594, ద్వితీయ స్థానం గౌరీ కార్తీక్ 591, తృతీయ స్థానంలో వి ముజ్మిల్, యోగిత్ సాయి 589 మార్కులు సాధించారు. 500 మార్కుల పైన 49 మంది విద్యార్థులు సాధించారని, మంచి ఫలితాలు సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ మాలకొండారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వేల్పుల వెంకట్ యాదవ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విజయం పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
01.05.26 శుక్రవారం


# ఫలించిన కలెక్టర్ కృషి



## టెన్త్ ఫలితాలలో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ప్రకాశం జిల్లా

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 30)**

పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రకాశం జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపడం పై జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశం, ఆయా విభాగాధిపతుల పర్యవేక్షణ, అధికారుల ఉమ్మడి కృషితోనే ఉత్తమ ఫలితాలు వచ్చాయని అధికార యంత్రాంగం వర్షం వ్యక్తం చేసింది.

**వన్ ఆఫీసర్... వన్ ఇన్స్టిట్యూట్**

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడే విద్య, వైద్యం, త్రాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని రాజాబాబు స్పష్టం చేశారు. చెప్పినట్లుగానే పరిపాలనలో ఈ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా దృష్టి సారించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి అధికారి ఒక హాస్టల్ను సందర్శించి వాటిలోని పరిస్థితులను పరిశీలించి, విద్యార్థులు మెరుగైన సాధించేలా, ఆయా హాస్టళ్లలో ఏమైనా సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో అధికారులు ఆయా హాస్టళ్లను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకున్నారు.

**పక్కాగా 100 రోజుల ప్రణాళిక**

తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులలో భయాన్ని తొలగించేలా, మంచి మార్కులు సాధించేలా వందరోజుల పాటు అమలు చేసేలా కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి పై శ్రద్ధ పెట్టి వారి ప్రతిభను మెరుగుపరిచేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజు రోజు స్లిప్ టెస్టులు పెట్టి, విద్యార్థులకు వెంటనే మార్కులను అధికారులు తెలియజేశారు. బలహీనతలను అధిగమించేలా స్టడీ అవర్స్ నిర్వహించారు. ప్రభుత్వ స్కూళ్లను కూడా అధికారులు దత్తత తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు. దీనితో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఆయా స్కూళ్లను నిరంతరం సందర్శించి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళిక అమలవుతున్న తీరును పర్యవేక్షించారు. మొత్తం ప్రణాళిక అమలును ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ ఆరా తీశారు. ఫలితంగా వివిధ విభాగాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత స్థాయిలో మార్కులు సాధించారని ఉపాధ్యాయ వర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. జిల్లాలోని ఎపి రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ పాఠశాలల విద్యార్థులు మొత్తం 375 మంది 10వ తరగతి పరీక్ష వ్రాయగా 348 మంది విద్యార్థులు పాసు కావడం జరిగింది. 93.98 శాతం ఉత్తర్ణత సాధించగా రాష్ట్ర స్థాయిలో రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి జిల్లా 2వ స్థానంలో నిలిచింది. కొండపి రెసిడెన్షియల్ స్కూల్ కు సంబందించిన విద్యార్థి లక్ష్మి ప్రణతి 587 మార్కులతో జిల్లాలో మొదటి స్థానం సాధించగా, అదే రెసిడెన్షియల్ కు సంబందించిన విద్యార్థి పౌర్ణమి 580 మార్కులతో రెండు స్థానం సాధించడం జరిగింది.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 30)**

మార్కాపురం జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న జన గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ఈ జన గణనను చేపట్టడానికి జిల్లాలోని 21 మండలాల్లోని 497 గ్రామాలు, 4 మున్సిపాలిటీల్లో 2073 మంది ఎమ్యూనరేటర్లు, 350 మంది సూపర్వైజర్ లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జనగణన వివరాలు సేకరించాలన్నారు. ఇంటికి వచ్చిన జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని ఆమె చెప్పారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించి జయప్రదం చేయాలని కలెక్టర్ కోరారు.

# ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకుంది...



**అంతటితో ఆగక ప్రయివేట్ వీడియోలు తీసుకున్న భార్య**
**ఆ దారుణాలు చూడలేక హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న భర్త**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 30)**

మార్కాపురం పట్టణానికి చెందిన సీతారాం నంద్యాలకు చెందిన రేణుకతో 2018లో వివాహం అయ్యింది. అనంతరం వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ బాచుపల్లిలో కుటుంబం స్థిరపడింది. రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రయివేటు వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా తన భార్య నిజస్వరూపం తెలిసి ఫిబ్రవరి నెలలో సీతారాం 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ లేఖలో తన భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో వివాహేతర సంబంధం పెట్టుకుందని రాశాడు. అంతేగాక ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడన్నారు. ఆ దారుణాలను చూసి తాను ఎలా తట్టుకోగలగాలి..అసలు రేణుకకు ఏం కావాలి. ప్రేమనా లేక శృంగారమా? తన భార్యకు ఏ లోటు రాకుండా (తరువాయి 4లో...)

# బల్కుగా ఆయిల్ వినియోగించే వారందరూ ముందుగానే ఇండెంట్ ఇచ్చి బుక్ చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 30)**

బల్కుగా ఆయిల్ వినియోగించే వారందరూ ముందుగానే ఇండెంట్ ఇచ్చి బుక్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు, వివిధ శాఖల పర్యవేక్షణలోని యూనిట్లకు అవసరము - సరఫరా పై గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిందని, రెగ్యులర్ వినియోగానికి ఎలాంటి ఇబ్బందీ లేదని డిఎస్ఓ పద్మశ్రీ 4

# ఇంటింటి జనగణన నిర్వహణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి

## రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 30)**

ఇంటింటి జనగణన నిర్వహణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. మే నెలలో నిర్వహించవలసిన ఇంటింటి జనగణన కార్యక్రమం నిర్వహణపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె నివాస్‌తో కలిసి గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు చేపడుతున్న ఇంటింటి జనగణన నిర్వహణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడంతో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, అందుకు తగినవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కోసం "1855" అనే జాతీయ టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. జనగణన కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వర్చువల్ సమావేశానికి ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో మే1వ తేదీ నుండి నిర్వహించనున్న ఇంటింటి జనగణన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని స్పెషల్ సిఎస్ కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ రాంభూపాల్‌రెడ్డి, సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నూరు శాతం ఫలితాలతో పాటు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దేవరాజు గట్టు హైస్కూల్ విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 30)

గురువారం విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో దేవరాజు గట్టు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. పరీక్షలకు హాజరైన 22 మంది విద్యార్థులలో ఆరుగురు విద్యార్థులు 500 మార్కులు పైచిలుకు సాధించారు. 20 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, ఇద్దరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత పొందారు. ఆ పాఠశాల 10 వ తరగతి విద్యార్థిని గుమ్మా భవిత 583 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో, పెద్దారవీడు మండల స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఎస్‌ఏ రసూల్, ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, పాఠశాల బోధనా సిబ్బంది హర్షం ప్రకటించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జి భవిత, టివి రేవతి (574), డి. మహేశ్వరి (537) లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది , మండల విద్యా శాఖాధికారి కె. సుబ్రహ్మణ్యం వారి ఇండ్లకు వెళ్లి, స్వీట్స్ పంచి, శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. గత సంవత్సరం కూడా ఈ పాఠశాల విద్యార్థినే మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందడం విశేషం.

## త్రిపురాంతకం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి అద్భుత ప్రతిభ 575 మార్కులతో నవదీప్ ఘన విజయం




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 30)

త్రిపురాంతకంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు మెడ బలిమి నవదీప్. గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నవదీప్ 600 మార్కులకు 575 మార్కులు సాధించి తన పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడు.

విజయ ప్రస్థానం : నవదీప్ మొదటి నుండి చదువులో చురుగ్గా ఉంటూ, ఉపాధ్యాయుల సూచనలను తూచా తప్పకుండా పాటించేవాడు. క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్, పాఠశాల అందించిన ప్రోత్సాహం తన ఈ విజయానికి ప్రధాన కారణమని నవదీప్ తెలిపాడు. నవదీప్ సాధించిన ఈ ఘనత పై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని నవదీప్ నిరూపించాడని వారు కొనియాడారు. విద్యార్థి తండ్రి, కుటుంబ సభ్యులు నవదీప్ విజయాన్ని చూసి ఆనందంలో మునిగిపోయారు.

## పది పరీక్షల్లో బాపట్ల జిల్లాకు ఉత్తమ ఫలితాలు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఏప్రిల్ 30)

పది పరీక్షల్లో బాపట్ల జిల్లాకు ఉత్తమ ఫలితాలు వచ్చాయని జిల్లా విద్యాశాఖ అధికారి డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 86.07 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బాలికలు 88.74, బాలురు 83.39 శాతం ఉత్తీర్ణత పొందారని చెప్పారు. 597 మార్కులు అద్దంకి బెల్ అండ్ బ్లేనేట్ హై స్కూల్ విద్యార్థి సాధించగా, జెడ్పీ గర్ల్స్ హై స్కూల్ కొల్లూరు విద్యార్థి 596 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. జిల్లా పరిషత్ పాఠశాల లు 80.52 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 72.61 శాతం ఉత్తీర్ణత పొందారని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలు 92.20, కెజిబివిలు 87.8 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. రీ వెరిఫికేషన్ కోసం మే 1 నుంచి 7 వరకు రూ 1000 ఫీజు చెల్లించాలి. రీ కౌంటింగ్ కోసం మే 1 నుంచి 7 వరకు అప్లై చేసుకోవచ్చు. దీనికి రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం మే 1 నుంచి 9వ తేదీ వరకు అప్లై చేసుకోవచ్చు అని తెలిపారు. రూ.50 ఫెనాల్టీతో మే 10 నుంచి 24 వరకు అప్లై చేసుకోవచ్చన్నారు. మూడు సబ్జెక్టు లకు రూ.110.6, 6 సబ్జెక్టులకు రూ.120 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మన జిల్లా 15వ స్థానంలో నిలిచిందని వివరించారు. గతేడాది కన్నా 3 శాతం ఉత్తీర్ణత పెరిగినట్లు తెలిపారు.

# బల్క్‌గా ఆయిల్ వినియోగించే వారందరూ ముందుగానే ఇండెంట్ ఇచ్చి బుక్ చేసుకోవాలి



ఈ సందర్భంగా తెలిపారు. అన్ని వాహనాలకు బంకులలో ఆయిల్ అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ఆయా శాఖల పర్యవేక్షణలో ప్రత్యేక టోకెన్లు మంజూరు చేశామన్నారు. చీమకుర్తిలోని గ్రానైట్ పరిశ్రమలు కూడా తమ అవసరాలకు ముందుగానే ఇండెంట్ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. అయితే బల్లికురవ ప్రాంతంలోని గ్రానైట్ యజమానులు మాత్రం బల్క్ వినియోగానికి ముందస్తుగా ఇండెంట్ ఇవ్వలేదని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి ఆమె తెచ్చారు. దీని పై ఆయన స్పందిస్తూ బల్క్ వినియోగానికి ప్రత్యేకంగా ముందస్తు ఇండెంట్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులతో ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించాలని కలెక్టర్ చెప్పారు. మార్కెటింగ్, పరిశ్రమల శాఖలు కూడా తమ పరివేక్షణలోని యూనిట్లకు ఆయిల్ అవసరతను గుర్తించి, ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వరలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 30)

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈరోజు విడుదలైన పదవ తరగతి ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి. కాకర్ల ఉన్నత పాఠశాలలో 72 మంది విద్యార్థులకు గాను 72 మంది విద్యార్థులు పాసయ్యారు. మర్రిపూడి ఉన్నత పాఠశాలలో 74 విద్యార్థులకు గాను 73 మంది విద్యార్థులు పాసయ్యారు కూచిపూడి ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులకు గాను 29 మంది విద్యార్థులు పాసయ్యారు. గార్లపేట ఉన్నత పాఠశాలలో 31 విద్యార్థులకు గాను 31 విద్యార్థులు పాసయ్యారు. తంగేళ్ల ఉన్నత పాఠశాలలో 36 మంది విద్యార్థులకు గాను 36 మంది విద్యార్థులు, కేజీబీవీ పాఠశాలలో 39 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు పాసయ్యారు. మర్రిపూడి మండలంలో కాకర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని పులిచెర్ల శశి కీర్తి 585 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. తంగేళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని పి నిరుపమా తేజ్ 584 మార్కులతో ద్వితీయ స్థానంలో, మర్రిపూడి ఉన్నత పాఠశాల విద్యార్థిని వైఎల్ అనన్య 583 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మర్రిపూడి మండల పరిధిలో మొత్తం 281 మంది విద్యార్థులకు గాను 280 మంది విద్యార్థులు పాసయ్యారని మండల విద్యాశాఖ అధికారి ఇవి రంగయ్య తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ఇవి రంగయ్య, యు శ్రీనివాసులు, ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు.

## ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకుంది...

చూసుకున్నా కానీ ఆమె తనకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతో పాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు.

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

### సత్తాచాటిన మండలంలోని సర్కారు బడుల విద్యార్థులు







(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఏప్రిల్ 30)

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పుల్లలచెరువు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఘనవిజయం సాధించారు. తక్కువ వనరులు, గ్రామీణ వాతావరణం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నా విద్యార్థిని,విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మండల స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మండలంలోని పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తక్కెళ్ళ పవన్ కుమార్ 585 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించి ప్రతిభ శిఖరాలను అధిరోహించాడు. అదే పాఠశాలకు చెందిన కె వెంకట దివ్య 583 మార్కులతో రెండో స్థానం దక్కించుకుంది. పిడికిటివానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి దివ్య 568 మార్కులతో మూడో స్థానంలో నిలిచి ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను చాటించింది. మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచి, గ్రామీణ విద్యా ప్రమాణాలను నిలబెట్టినట్లు మండల విద్యా శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు వెంకట భాస్కర్, ఇందిరా ప్రసాద్ టాపర్లతో పాటు అన్ని పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామీణ ప్రజలకు గర్వకారణంగా నిలిచాయి. పుల్లలచెరువు మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగడానికి ఈ విజయాలు దోహద పడతాయని వారు తెలిపారు. మండలంలోని పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిడికిటివానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మర్రివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుల్లలచెరువు కేజీబీవీ, మురికిమల్ల ఆశ్రమ పాఠశాల,గారపెంట ఆశ్రమ పాఠశాలల నుంచి మొత్తం 253 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు వ్రాస్తే వీరిలో 209 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 82 శాతం ఉత్తీర్ణత సాధించారని వారు తెలియజేశారు.

# పదిలో మేరిసిన అమృత వర్షిని

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 30)

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని చిన్నగంజాం ప్రభుత్వ జెడ్పి హైస్కూలు విద్యార్థులు ఘనవిజయం సాధించారు. గ్రామీణ వాతావరణం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నా విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మండల స్థాయిలో అత్యుత్తమ పలితాలు సాదించారు. పాఠశాలకు చెందిన గుమ్మడి అమృత వర్షిని 585 మార్కలతో మొదటి స్థానం, ఎమ్ శశిధర్‌రెడ్డి 571 మార్కులతో ద్వితీయ స్థానం, ఎమ్ నందిని 568 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల్లో మొదటి స్థానం పొందిన గుమ్మడి అమృత వర్షిని, ఎమ్ శశిధర్ రెడ్డి, ఎమ్ నందిని ని ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ నరసింహరావు, సిహెచ్ సుబ్బారావు, ప్రసాదరావు, సిహెచ్ కుమార్, నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.







# మాలకొండ పై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 30)
మే 2వ తేదీ శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండపై స్వామివారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి దర్శన ఏర్పాట్లు, అదనపు క్యూలైన్లు, తాగునీరు, భోజన సదుపాయాలు, అదనంగా లడ్డుప్రసాదాల తయారీ, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, దాతలు, సేవకుల సహకారం, ఇంకా పలు ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, పోలీసులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలకు 25 నుంచి 30 వేల మంది భక్తులు తరలి రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. వారందరూ సంతృప్తిగా శ్రీ లక్ష్మీ సమేత నరసింహస్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్శనం అనంతరం, ప్రతి ఒక్కరికీ భోజన ప్రసాదం అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. అందుకోసం డైనింగ్ హాల్ తో పాటు వెనుక వైపు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసామన్నారు. అలాగే 30వేలకు పైగా లడ్డు ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకుని, దాతల సహాయంతో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ భక్తులకు అందజేసే ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. భక్తులకు ఎండల నుంచి ఉపశమనం కలిగేలా, చలువ పందిళ్లు, కార్పెట్లు, కూలర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ విషయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నాగేశ్వరావు చెప్పారు. భారీ వాహనాల పార్కింగ్ కోసం, కొండ కింద ఆర్చ్ సమీపంలో విశాలమైన ప్రదేశాన్ని సిద్ధంగా ఉంచామని చెప్పారు. కొండపైకి ద్విచక్ర వాహనాలు, పరిమిత సంఖ్యలో కార్లను మాత్రమే అనుమతిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. స్వామివారి జయంతి సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల నుంచి సుమారు 100 మందికి పైగా పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. స్వామి వారి జయంతిని పురస్కరించుకుని, మాలకొండ దేవస్థానం పరిధిలో పనిచేసే 123 మంది ఉద్యోగులకు



యూనిఫామ్‌లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నేతలు పెగడ శ్రీనివాసులు, బొల్లినేని నాగేశ్వరరావు, కామినేని అశోక్, మోహన్, శనివారపు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.





## పదవ తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థిని కె లక్ష్మీ ప్రసన్న



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)
మండలంలోని కే అగ్రహారం శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలు పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన బోధనను మరోసారి రుజువు చేశాయి. ఈ సందర్భంగా శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్స్ పొతకమూరి యతేంద్ర, వాసుదేవరావులు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు టాప్ మార్కులు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థిని కె లక్ష్మీ ప్రసన్న 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి పొన్నలూరు మండలం టాప్‌గా నిలిచిందని తెలిపారు. 13 మంది విద్యార్థులు 550 ఆ పైన మార్కులు, 19 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కె.లక్ష్మీ ప్రసన్న ను విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు. ఇంతటి అత్యున్నత ఫలితాల సాధనలో కృషి చేసిన విద్యార్థిని, విద్యార్థులను, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనలో మా అధ్యాపక బృందం యొక్క కృషి, విద్యార్థుల యొక్క శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు.

## చెత్తను ఇవ్వండి.... నిత్యవసర సరుకులు పొందండి..!



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 30)
మండలంలోని మణికేశ్వరం గ్రామంలో గురువారం 'స్వచ్ఛ రథం' వాహనం పర్యటించింది. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా స్వచ్ఛ రథం వాహనం గ్రామంలోని ప్రతి వీధిలోనూ తిరుగుతూ, గ్రామస్తుల వద్ద ఉన్న పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, పాత అట్టపెట్టెలు, ఇనుప సామాన్లను సేకరించింది. సాధారణంగా వీధుల్లో పారవేసే ఇటువంటి వ్యర్థాలను ప్రభుత్వం నిర్ణయించిన నిర్దేశిత ధరల ప్రకారం తూకం వేసి, వాటి విలువకు సమానమైన నిత్యవసర సరుకులను అక్కడికక్కడే ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెదేపా నేత షేక్ కరిముల్లా, అబ్రహాం, చాంద్ బాషా, మూకిటి శీను, పంచాయతీ కార్యదర్శి మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ సాయి స్కూల్ విద్యార్థులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)
గురువారం విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉలవపాడు శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. 600 మార్కులకు గాను వాయల జాహ్నవి (కరేడు) 588 మార్కులు, గొత్తుల నన్విత (భీమవరం) 586 మార్కులు, దాసరి రిషిక (ఉలవపాడు) 584 మార్కులు, తలిసేట్టి కీర్తి శ్రీ (భీమవరం) 580 మార్కులు, పిగిలి గోకుల సాయి (కరేడు) 580 మార్కులు సాధించారు. 550 కి పైగా 20 మంది, 500 కు పైగా 41 మంది విద్యార్థులు మార్కులు సాధించడం జరిగిందని స్కూల్ ప్రిన్సిపల్ మౌనిక తెలియజేయడం జరిగింది. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ వెంకట శేషమ్మ అభినందించడం జరిగింది. సహాయ సహకారాలు అందించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలి తహాశీల్దార్ జె ప్రభాకరరావు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 30)
రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలని మండల తహశీల్దార్ జే ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం ఎస్టీ కాలనీ నందు తహశీల్దార్ జె ప్రభాకరరావు అధ్వర్యంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి పౌరుడూ సమానత్వంతో మెలగాలన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్నేహభావంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె. ప్రభాకరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె సుజాత, చిన్నగంజాం ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ శ్రీ చరణ్, హెడ్ కానిస్టేబుల్ సీతారామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో అంబేద్కర్ గురుకులం విద్యార్థుల ప్రభంజనం

### 89.49 శాతం ఉత్తీర్ణత

### విద్యార్థులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)



గురువారం విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13,538 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,115 మంది విద్యార్థులు పాసయ్యారు. 89.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విద్యార్థులను అభినందించారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు. మంత్రి లోకేశ్ విద్యా శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఆయన తీసుకొచ్చిన నూతన విద్యా విధానాలతోనే 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. పేద పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్న సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పంతో నీట్, ఐఐటీ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10కి పెంచాం. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పేద పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎంత ఖర్చు అయినా మా ప్రభుత్వం భరిస్తుంది. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి స్వామి అన్నారు.

## పదో తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించిన శత వసంతాల విద్యావనం



### జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 30)
పదో తరగతి ఫలితాలలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. గురువారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో యస్‌కె షంషీర్ 578 మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 253 మంది విద్యార్థులకు గాను 219 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 87% ఉత్తీర్ణతతో నిలిచారు. 34 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి యం శ్రీనివాసులు, మార్కాపురం మండల విద్యాశాఖ అధికారి రాందాస్ నాయక్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి ఎస్‌కె షంషీర్, వారి తల్లిదండ్రులను సన్మానించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించి, ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాలలో 100% ఉత్తీర్ణత

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)

స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు మాధవ తెలిపారు. టి అనిల్ కుమార్ 522, కాలే కార్తీక్ 515, బిరుదుల వరుణ్ రాజ్ 510 మార్కుల సాధించారని మాధవరావు తెలిపారు.

## పది ఫలితాల్లో సౌజన్య రికార్డు

## మండల విద్యాశాఖ అధికారులు చిరు సత్కారం




(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 30)

గురువారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో తర్లుపాడు మండలం, చెన్నారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె సౌజన్య అసాధారణ ప్రతిభ కనబరిచింది. 590 మార్కులు సాధించి, మండల స్థాయిలోనే మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. కే సౌజన్య సాధించిన ఈ గొప్ప విజయాన్ని గుర్తించిన మండల విద్యాశాఖ అధికారులు డి సుజాత, అచ్యుత సుబ్బారావు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు సౌజన్యను శాలువాతో ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కూడా పట్టుదలతో శ్రమిస్తే ఇలాంటి గొప్ప ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు. సౌజన్య భవిష్యత్తులో మరిన్నిఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, రవిశేఖర్‌రెడ్డి, కోటిమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాలలో జెనిత్ హై స్కూల్ విద్యార్థుల విజయభేరి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 30)

గురువారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో స్థానిక జనిత్ హై స్కూల్ విద్యార్థులు విజయభేరీ మ్రోగించారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిహెచ్ సౌజన్య 581 మార్కులతో ప్రథమ స్థానం ,ఎం రమ్యశ్రీ 573 మార్కులతో ద్వితీయ స్థానం ఈ ప్రణతి 550 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని, అదేవిధంగా కే శ్రావణ్ నాయ క్ 573 మార్కులు జె తనుశ్రీ 523 మార్కులు, కే ఆకాష్ 523 మార్కులతో అత్యుత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మొత్తం 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 77% ఉత్తీర్ణత శాతాన్ని సాధించడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో అత్యున్నత ఫలితాలను సాధించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ,ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# 10వ తరగతి పరీక్షలో మండలస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వీరే








(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 30)

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది నిర్వహించిన 10వ తరగతి పరీక్షల్లో మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక లూథర్ ఉన్నత పాఠశాల, ఒక కేజీబీవీ పాఠశాల మొత్తం 11 ఉన్నత పాఠశాలలు ఉండగా అందులో చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతున్న కే సౌజన్య 600 మార్కులకు 590 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంసాధించింది. కలుజువ్వలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దారెడ్డి వెలుగొండారెడ్డి 600 మార్కులకు 583 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. అలాగే మీర్జాపేట గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కోలగట్ల గిరిషన్‌రెడ్డి 600 మార్కులకు 569 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. దీంతో మండల విద్యాశాఖ అధికారులు దేవరకొండ సుజాత, అచ్యుత సుబ్బారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది వారిని అభినందించారు. అంతే కాక ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల పిల్లలు కార్పొరేట్ పాఠశాలలో చదివించుకోనే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రస్తుత రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్, విద్యావ్యవస్థలో వినూత్నమైన మార్పులు చేసి విద్యా వ్యవస్థను అగ్రస్థానంలో చూడాలన్నదే ఆయన ధ్యేయం. కనుక అందుకు అనుగుణంగా పాఠశాలలలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది కూడా పిల్లల పై ప్రత్యేకమైన శ్రద్ధ వహించి అంకిత భావంతో విద్యార్థులకు విద్యను బోధించడంతో మట్టిలో మాణిక్యాలాంటి పిల్లలు వారి విజ్ఞానాన్ని పబ్లిక్ పరీక్షలో చాటిచెప్పి మండలానికే ఆణిముత్యాలుగా నిలిచారన్నారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యయులకు, ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా అభినందనలు తెలియజేశారు. మండలంలో అన్ని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు మంచి పర్సంటేజీలతో విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం జరిగిందని మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పదవతరగతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎంఈఓ

ప్రభుత్వ జూనియర్ కళాశాల టాప్ 3 సాధించిన రంగస్వామి, సాయి, సమీర్

(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 30)

గురువారం ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంచలన విజయాన్ని నమోదు చేశారు. ప్రతిభతో మెరిసిన విద్యార్థులు పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. మొదటి స్థానం రంగస్వామి, రెండవ స్థానం కె సాయి, మూడవ స్థానం షేక్ మహమ్మద్ సమీర్ సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. ఈ సందర్భంగా ఎంఈఓ అబ్దుల్ సత్తార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తూ వారి విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇంకా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. మీ విజయం మీ కుటుంబానికి మాత్రమే కాకుండా పాఠశాలకు









## వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)

ఉలవపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఓగుబోయిన యానాది, మస్తానమ్మల కుమారుడు శ్రీకాంత్ యాదవ్ సౌజన్యల వివాహ కార్యక్రమం గురువారం సింగరాయకొండలోని కాకతీయ కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.





# అనాధ వృద్ధులకు అన్నదానం.. బాటసారులకు మజ్జిగ వితరణ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 30)

మండుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బద్వేల్ ప్రాంతంలో పలువురు పాదాచార్యులు దాహర్తి తీర్చుట కొరకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రముఖ జీఎన్ సిల్వర్ వ్యాపారి విద్యాసాగర్ పలువురికి మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోష్కరమని ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కేవి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్, కొలిశెట్టి సుబ్బారావు, సుధాకర్తో పాటు పలువురు అన్నారు. జీఎన్ సిల్వర్ అధినేత విద్యాసాగర్ తనయుడు దోనాది సింబ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యాసాగర్ తన సేవా గుణాన్ని చాటుకుంటూ, తన కుమారుడి జన్మదినం సందర్భంగా సమాజానికి ఉపయోగపడేలా ఈ కార్యక్రమాలను చేపట్టారు. మైదుకూరు రోడ్డులోని మంచినీటి చలివేంద్రం వద్ద సుమారు 500 మందికి పైగా బాటసారులకు, ప్రయాణికులకు మజ్జిగ వితరణ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా దాహార్తితో ఉన్న వారికి మజ్జిగ పంపిణీ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



**అనాధ వృద్ధులకు అన్నదానం:**

అనంతరం తెలుగు గంగా కాలనీలోని 'ఆనంద నిలయం' నిరాశ్రయుల వసతి గృహంలో అనాధ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసరా కోల్పోయిన వృద్ధులకు కడుపునిండా భోజనం పెట్టి, సింబ పుట్టినరోజును అర్థవంతంగా జరిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజ, బంగారు దుకాణం వ్యాపారి నాగేంద్ర, పార్థసారథి, పోలిరెడ్డి, అరుణ్ కుమార్, అజిస్ మాట్లాడుతూ విద్యాసాగర్ నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, పేదలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింబ కుటుంబ సభ్యులు జీఎన్ సిల్వర్స్ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌ను కలిసిన గునుపూడి భాస్కర్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)

టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బుధవారం మంగళగిరిలో అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఇదే వేదికగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రెండో సారి పొదిలి పట్టణానికి చెందిన గునుపూడి భాస్కర్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమం అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# పదవ తరగతిలో ఉత్తమ ఫలితం సాధించిన జడ్పీహెచ్ఎస్ ముళ్ళమూరివారిపాలెం విద్యార్థిని



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)

పదవ తరగతిలో ముళ్ళమూరి వారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థిని ఎనిమిరెడ్డి మాన్యస్థాయి 581 మార్కులు సాధించి పొన్నలూరు మండల ప్రభుత్వ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. చెన్నుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం లక్ష్మీప్రసన్న 577 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. మాలపాడు కస్తూరిబా గాంధీ పాఠశాల చెందిన ఏ హేమచందన 575 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. 253 విద్యార్థులు పరీక్షలు రాయిగా 217 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు, ఉత్తీర్ణత శాతం 85.77 సాధించారు. అలాగే ప్రైవేటు పాఠశాలకు చెందిన కే అగ్రహారం శ్రీవిద్య అనే కీర్తన స్కూల్ విద్యార్థిని మార్కులు సాధించింది. శుభోదయం స్కూల్ విద్యార్థి అరుణ్ కుమార్ రెడ్డి 590 మార్కుల సాధించారు అని ఎంఈఓ2 సుబ్బరామయ్య తెలిపారు.

# చలివేంద్రం ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

ప్రకాశం జిల్లా యాదవ ప్రొటెక్షన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఒంగోలులోని శ్రీశ్రీశ్రీ కాటమరాజు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ చింతపల్లి గోపి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. దీంతో పాటు కాటమరాజు విగ్రహంకు స్టీల్ మెట్లను బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ సహకారంతో నిర్మించామని, దానిని చింతపల్లి గోపి చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లెబోయిన రాజు, లగ్గాల కోటేశ్వరరావు, దూళ్ల అప్పారావు, పాటిబండ్ల పేరయ్య, పోడమేకల రామారావు యాదవ్, తన్నీరు వెంకటేశ్వర్లు, షేక్ జానీ, సురేష్ చౌదరి, కుట్టుబోయిన వెంకయ్య , బాలు యాదవ్, బద్రి, నవీన్ యాదవ్, నాగం వెంగయ్య యాదవ్ (చంటి), తదితరులు పాల్గొన్నారు.






# పదవ తరగతి ఫలితాలలో మెరిసిన గీతాంజలి స్కూల్ ఆణిముత్యం

**595 మార్కులతో టౌన్ టాప్‌గా నిలిచిన ఈశ్వర్ కుమార్**
**అభినందనలు తెలిపిన స్కూల్ యాజమాన్యం**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)

గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పొదిలి పట్టణంలో ప్రముఖ విద్యా సంస్థ గీతాంజలి హై స్కూల్ విద్యార్థి కందిరి వెంకట నాగ ఈశ్వర్ కుమార్ 595 మార్కులు సాధించి టౌన్ టాప్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా కందిరి వెంకట నాగ ఈశ్వర్‌ను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ప్రతి సంవత్సరం లాగే గీతాంజలి హై స్కూల్ అత్యుత్తమ ఫలితాలు సాధించిందని స్కూల్ చైర్ పర్సన్ కె భాగ్యలక్ష్మి, స్కూల్ డైరెక్టర్స్ కె ప్రజ్వల, దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ యం ప్రశాంతి సంతోషం వ్యక్తం చేశారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన గూడూరి ఎరిక్షన్‌బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 30)

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో,తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ని యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# పదో తరగతి ఫలితాల్లో మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఘన విజయం


(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)



ఆంధ్రప్రదేశ్‌లో గురువారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని జి పవన కుమారి 594 మార్కులు సాధించి ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా జి పవనకుమారిని స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. తన అసాధారణ ప్రతిభతో పొదిలి టౌన్ సెకండ్ స్థానాన్ని కైవసం చేసుకుని, పాఠశాల కీర్తిని వ్యాపింపజేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన కారణంగా స్కూల్ కరస్పాండెంట్ యు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. పవనకుమారి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని యాజమాన్యం , ఉపాధ్యాయులు కోరుకున్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో 'శ్రీ సాయి విద్యానికేతన్' విద్యార్థుల ప్రభంజనం




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 30)

రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో బద్వేల్ పట్టణంలోని శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. పాఠశాల నుంచి ఈ ఏడాది 151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం.

విజేతల వివరాలు:

విద్యార్థులలో 19 మంది 580 కంటే ఎక్కువ మార్కులు సాధించి తమ మేధస్సును చాటుకున్నారు. అలాగే 102 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులతో ఘన విజయం సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో బి వసంత లక్ష్మి (591), డివి నాగ హర్షిత (590), జి గురు ఉమా మహేశ్వర్ (590), బి యశస్విని (589), ఎల్ అమర్‌నాథ్‌రెడ్డి (589), టి దీపిక (588), బి కృష్ణ శశి (588) వంటి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిలో ఉన్నారు. విద్యార్థుల ఈ అద్భుత విజయానికి కారణమైన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ నాగిరెడ్డి శంకర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్ విదితారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.







## మండల స్థాయి టాపర్స్ గా సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)

గురువారం విడుదలయిన పదవతరగతి విద్యార్థుల ఫలితాల నందు మండలంలో 574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 509 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. ఉత్తీర్ణత శాతం 89గా నమోదు అయింది. మండలంలో 591 మార్కులతో సెయింట్ జోసెఫ్ కు స్కూల్ కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంవి భార్గవరెడ్డి, వి శ్రీవల్లి మండల టాపర్స్ గా నిలిచారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఏపి మోడల్ స్కూల్ వీరేపల్లి విద్యార్థిని టి సాయి లక్ష్మి జస్వంతి 590 మార్కులు సాధించగా, కరేడు హై స్కూల్ నుండి కే శ్రీకన్య 587 మార్కులు సాధించింది. ఫెయిల్ అయినటువంటి విద్యార్థులకు మే 25 నుండి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ఉత్తీర్ణులయిన విద్యార్థులందరికీ మండల విద్యాశాఖాధికారులు అభినందనలు తెలియచేశారు.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో ముందుగా వివిధ రకాల విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో ఖో ఖో పోటీలు నిర్వహించారు. రోజు రోజుకు ఎక్కువ మంది విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన తరగతులను ఉపయోగించుకుంటున్నారు. చివరిగా పిల్లలకు స్నాక్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మొత్తం 43 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు తెలియజేశారు.

## దాతృత్వం దేవుడిచ్చిన వరం కిడ్నీ వ్యాధి గ్రస్తుడికి రూ.5,000 ఆర్థిక సహాయం చేసిన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీనారాయణ



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, ఏప్రిల్ 30)

దాతృత్వం దేవుడిచ్చిన వరమని వెలిగండ్ల మాజీ సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు అన్నారు. వెలిగండ్ల మండల కేంద్రంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మట్టిమల్లు రంగారావుని పరామర్శించి రూ.5,000ల ఆర్థిక సాయాన్ని గొరిగే వెంకటసుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొరిగే లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం సన్నీ, కమల్, వలి, తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, కారంచేడు, ఏప్రిల్ 30)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళలు, చిన్నారుల భద్రత కోసం రూపొందించిన 'శక్తి' యాప్ ఆపద సమయంలో దైవంలా అండగా నిలుస్తోందని ఎస్ఐ హరిబాబు అన్నారు. గురువారం మండల వెలుగు కార్యాలయంలో ఎపిఎమ్ మోహన్‌రావు పర్యవేక్షణలో శక్తి టీం ఎస్ఐ హరిబాబు, సఖీ ఓఎస్‌సి సెంటర్ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ నేతాజీ, మండల తెదేపా అధ్యక్షుడు శ్రీహరి ముఖ్య అతిధులగా హాజరైయ్యారు.ఇ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిళల భద్రత రక్షణ, వారి పై జరిగే అత్యాచారాలు అలాగే శక్తి యాప్ ఎలా వాడాలి ? దాని యొక్క ఉపయోగాలు ఆయాప్ ద్వారా మహిళలు వారు పడుతున్న ఇబ్బందులు దానిలో ఎలా తెలియజేయాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. సఖీ వన్ స్టాప్ సెంటర్ సర్వీసులు ఆపదలో ఉన్న మహిళలకు సఖి వన్ స్టాప్ సెంటర్ ఏ విధంగా ఉపయోగపడుతుందో, సైబర్ క్రైమ్స్ వలన చదువుకునే పిల్లలు ఎలా నష్టపోతున్నారు. అనే విషయాలను శక్తి టీం వివరించిరు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు కే సుబ్బారావు, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో నేతాజీ, ఏపీఎం మోహన్‌రావు, మండల తెదేపా అధ్యక్షుడు జి శ్రీహరి, జి సురేంద్ర బాబు, షేక్ కాసిం, బి మల్లేశ్వరరావు, వై పిచ్చయ్య చౌదరి, డి శ్రీను, జే ప్రహల్లాద, చంద్రశేఖర్, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో ముగ్గురికి జరిమానా విధించిన న్యాయమూర్తి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 30)

మార్కాపురం మండలంలో ట్రాఫిక్ నిబంధనల అమలు పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గురువారం గ్రామీణ ఎస్ఐ వి వేమన ఆధ్వర్యంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులు, పట్టణ పరిధిలో కీలక కూడళ్ల వద్ద ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వాహనదారులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా, రెండో తరగతి న్యాయ మేజిస్ట్రేట్ డి శాంత కుమారి విచారణ జరిపి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com